# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 10-08-2016**

శ్రావణశుద్ధ నవమి శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న కృష్ణవేణి పుష్కరాల పూర్తిస్థాయి ఏర్పాట్ల పై ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు బుధవారం తన అధికార నివాసంలో సమీక్షించారు. మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాల గుండా ప్రవహిస్తున్న కృష్ణానది ఇటీవలి వర్షాలకు పరవళ్లు తొక్కుతున్న నేపధ్యంలో పవిత్ర పుష్కర స్నానాలకు భక్తులు కోట్లాదిగా తరలిరానున్నారు. వరుస సెలవుల కారణంగా భక్తుల రద్దీ మరింత పెరగనున్నది. ఈ నేపధ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు మంత్రులు సిఎంకు వివరించారు. బుధవారం నాటి సమీక్షా సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, అటవీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, మున్సిపల్ శాఖ మంత్రి కె. తారకరామారావు, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్ రెడ్డి, శంభీపూర్ రాజు, సిఎంవో అధికారి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నెండేండ్లకోసారి వచ్చే పుష్కరాల సమయంలో భక్తులు కృష్ణానదిలో పూజలు, స్నానాలు, దాన ధర్మాలు, పిత్రు దేవతలకు పిండ ప్రధానాలు చేస్తే పుణ్యం కలుగుతుందని పుష్కర కాలంలో చేసే ఆయా కర్మల వలన శారీరక, మానసిక మలినాలు తొలగి పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సు కలుగుతాయని భక్తుల నమ్మకం. మన రాష్ట్రం నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచీ కూడా భక్తులు తరలిరానున్నారు. అగస్టు 12న ప్రారంభమై పదకొండురోజుల పాటు కొనసాగి అగస్టు 23న కృష్ణా పుష్కరాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏర్పాట్లకు సంబంధించి వివరాలు సేకరించడంతో పాటు సంబంధిత అధికారులకు పలు

ఆదేశాలు జారీ చేశారు. పలు ప్రాజెక్టులు నిండుతున్న నేపథ్యంలో దిగువకు నీటిని విడుదల చేయడంలో జాప్యం చేయవద్దని అధికారులకు సిఎం స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ లో ప్రారంభమైన మొదటి స్నాన ఘాట్ నుంచి నల్లగొండలోని ఆఖరి పుష్కర ఘాట్ వరకు నది పొడవునా పుష్కలమైన నీరు ఇప్పటికే ప్రవహిస్తుండడం పట్ల సిఎం సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకోసం మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన మొత్తం 81 పుష్కర స్నాన ఘాట్ల నిర్మాణం పనుల పై సిఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

గొందిమల్లలో ముఖ్యమంత్రి దంపతుల పవిత్ర స్నానం:

పుష్కరాల ప్రారంభం అగస్టు 12న, శ్రావణశుద్ధ నవమి శుక్రవారం ఉదయం గం.5:58 ని.లకు ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు సతీసమేతంగా మహబూబ్ నగర్ జిల్లా ఆలంపూర్ మండలంలోని గొందిమల్ల పుష్కరఘాట్ లో పవిత్ర స్నానమాచరించి కృష్ణా పుష్కరాలను ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి గురువారం సాయంత్రానికి ఆలంపూర్ చేరుకుని అక్కడి హరిత గెస్ట్ హౌజ్ లో బస చేస్తారు. తెల్లారి ఉదయం ముహూర్త సమయానికి సిఎం దంపతులు పవిత్ర స్నానమాచరించి అనంతరం జోగుళాంబ అమ్మవారి దర్శనం చేసుకుని హైదరాబాద్ కు తిరుగు ప్రయాణం కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రులు సిఎంకు వివరించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**